సాక్షి వికారాబాద్

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



సర్కారు ఆస్పత్రికి సుస్తీ

కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందక రోగులు అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథులు లేరు. 8లో ▸



మహిళ దారుణ హత్య

పెద్దేముల్ సమీపంలోని పెద్ద చెరువు కెనాల్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. 8లో ▸



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు..

యాలాల మండలం జుంటిపల్లిలోని రామ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 9లో ▸

న్యూస్‌రీల్

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



కొడంగల్: పట్టణంలోని జాతర స్థలంలో బుధవారం ఎద్దులతో బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పది క్వింటాళ్ల బరువు గల బండను వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఎద్దులతో లాగించారు. ప్రతిభ కనబరిచిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి దండ్ల భీములుకు చెందిన ఎద్దుకు, రెండో బహుమతి బాకారం రుత్విక్ రెడ్డికి చెందిన ఎద్దుకు, మూడో బహుమతి మద్దూరు వెంకటయ్యకు చెందిన ఎద్దుకు వచ్చింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలి



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

పరిగి: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో దివ్యాంగులకు చోటు కల్పించాలి ఆ సంఘం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను విస్మరిస్తోందన్నారు. బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వంలో విఫలమైందన్నారు.

మా భూములకు పట్టాలు ఇప్పించండి

స్పీకర్‌ను కోరిన పుల్‌మద్ది గ్రామ రైతులు



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అనంతగిరి: ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని వికారాబాద్ మండలం పుల్‌మద్ది రైతులు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూముల్లోకి ఫారెస్ట్ అధికారులు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆ. దీనంలో ఉన్న 200ల ఎకరాల భూమికి పట్టాలు ఇప్పించాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో రైతులు శ్యామ్, సుదర్శన్, అంజయ్య, లక్ష్మణ్, దానయ్య, బిచ్చయ్య, నర్సింహులు, భుజంగం తదితరులు ఉన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలు

శ్మశాన వాటికలు సమస్యలకు నిలయాలుగా మారాయి. వైకుంఠధామాల్లో మృతదేహాలు దహనం చేయాలన్నా.. ఖననం చేయాలన్నా కుటుంబ సభ్యులు, బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల కబ్జాల కారణంగా శ్మశాన వాటికలు కుచించుకుపోయాయి. నీటి వసతి లేక అంత్యక్రియలకు హాజరైన వారు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.

- శ్మశానవాటికల్లో వసతులు లేక ఇబ్బందులు
- నీటి సౌకర్యం లేక ట్యాంకర్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి





వికారాబాద్‌లోని గంగారం శ్మశానవాటిక, (ఇన్‌సెట్‌లో) కొడంగల్‌లోని దహన వాటిక

వికారాబాద్: మున్సిపాలిటీల్లో ఆఖరి మజిలీకి అవస్థలు తప్పడంలేదు. ఎన్నో చోట్ల కులాలు, మతాల వారీగా శ్మశాన వాటికలు ఉన్నప్పటికీ సమస్యలు తిష్టవేశాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ నిధులతో సౌకర్యాలు కల్పించారు. మరికొన్ని చోట్ల తాగునీరు, అంత్యక్రియలు నిర్వహించాక స్నానాలు చేయడానికి నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని శ్మశాన వాటికలకు ప్రహరీలు లేక ఆక్రమణలకు గురయ్యాయి. స్థలాలు కుచించుకుపోయి ఖననానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో తవ్విన చోటే మళ్లీ తవ్వి శవాలను పూడ్చుతున్నారు. స్థలాలు సరిపోక కేవలం దహన సంస్కారాలే చేస్తున్నారు. చాలా చోట్ల సమాధుల నిర్మాణాన్ని నిషేధించారు. కొన్ని చోట్ల సంప్రదాయం ప్రకారం సమాధులు కడుతున్నారు.

రెండు శ్మశాన వాటికలకే నిధులు

జిల్లా కేంద్రం.. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కులాలు, మతాల వారీగా మొత్తం 25 శ్మశాన వాటికలు ఉన్నాయి. వీటిలో కేవలం రెండింటిలో మాత్రమే ప్రభుత్వ నిధులతో సౌకర్యాలు కల్పించారు. గంగారం శ్మశాన వాటికకు రూ.కోటి కేటాయించి సౌకర్యాలు కల్పించారు. తాగునీరు, ప్రహరీ, దహన సంస్కారాలకు ప్లాట్‌ఫాంలు తదితర వసతులు కల్పించారు. వికారాబాద్–దన్నారం మార్గంలోని శ్మశానవాటికకు ఇటీవల రూ.70 లక్షలు కేటాయించారు.ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. వికారాబాద్–అంతగిరిపల్లి మార్గంలోని రామయ్యగూడ శ్మశాన వాటికలో తాగునీటి సౌకర్యం లేదు. అంత్యక్రియల అనంతరం స్నానాల కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.

ఒక్కటే వైకుంఠధామం

కొడంగల్: మున్సిపల్ పరిధిలో మెజారిటీ వర్గాలకు వైకుంఠ ధామాలు, శ్మశాన వాటికలు లేవు. 2003లో అప్పటి ఎంపీ జితేందర్‌రెడ్డి నిధులతో పట్టణ శివారులో నిర్మించిన వైకుంఠదామం ఒక్కటే ప్రజలకు అందుబాటులో ఉంది. సమాజంలో కొన్ని కులాలకు చెందిన వారు మృతదేహాలను దహనం చేస్తారు. మరి కొందరు ఖననం చేస్తారు. కొడంగల్ టౌన్‌లో సుమారు 10వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో హిందూ, ముస్లింలు ఎవరి మతం ప్రకారం వారు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. గతంలో నిజాంపాలనలో ఉన్న కొడంగల్‌లో ముస్లింలకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో శ్మశాన వాటికలకు స్థలం కేటాయించారు. పట్టణ శివారులో కొన్ని చోట్ల అనధికారికంగా శవాలను ఖననం చేస్తున్నారు. ఆరడుగుల స్థలం కోసం అవస్థలు పడుతున్నారు. పట్టణ శివారులో నిర్మించిన శ్మశాన వాటికలో ఎలాంటి సౌకర్యాలు లేవు. 2018 ఆగస్టు 02న 12 వార్డులతో కొడంగల్ మున్సిపాలిటీగా మారింది. కొడంగల్, కొండారెడ్డిపల్లి, ఐనన్‌పల్లి, బూల్కాపూర్, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట గ్రామాలను మున్సిపాలిటీలో కలిపారు. మున్సిపాలిటీ మొత్తంగా సుమారు 18 వేల జనాభా ఉంది. శ్మశాన వాటికలకు ప్రభుత్వం స్థలాలు కేటాయించాలని మున్సిపల్ వాసులు కోరుతున్నారు.



తాండూరులోని బీసీ శ్మశానవాటిక వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సమస్యలకు నిలయాలు.. ఆక్రమణలు

తాండూరు: మున్సిపల్ పరిధిలోని శ్మశాన వాటికలు సమస్యలకు నిలయంగా మారాయి. కనీస వసతులు లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద వీరశైవ సమాజానికి, బీసీలకు శ్మశాన వాటికలు ఉన్నాయి. బీసీ శ్మశాన వాటికలో వసతుల కల్పనకు ఐదేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రస్తుతం పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా మారింది. శ్మశానవాటిక ప్రాంగణంలోనే మలమూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ సంఘం సభ్యులు హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్మశాన వాటిక స్థలాల ను ఆక్రమించి యథేచ్ఛగా దుకాణ సముదాయా లు నిర్మించారు. ప్రస్తుతం వాటిని అద్దెలకు కేటాయించి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీరశైవ సమాజం శ్మశాన వాటిక ప్రధాన రోడ్డుకు పక్కనే ఉంటుంది. ఆ స్థలాన్ని ఆక్రమించి 70 దు కాణాలు నిర్మించి అద్దెలకు ఇచ్చారు. అడ్వాన్స్ రూపంలో రూ.లక్షలు తీసుకుంటున్నారు. ప్రతినెలా ఒక్కో దుకాణానికి వేల రూపాయల అద్దె లు వసూలు చేస్తున్నారు.బీసీ శ్మశాన వాటిక పరి స్థితి కూడా ఇలాగే ఉంది. ఇక్కడ కూడా దుకా ణాలు నిర్మించి అద్దెలకు ఇచ్చారు. ముర్షద్ దర్గా వద్ద గల కబ్రస్థాన్‌స్థలంలో సైతం దుకాణాలు నిర్మించి అద్దెలకు ఇచ్చారు.

అంతిమ వీడ్కోలుకు అన్నీ కష్టాలే..

పరిగి: మున్సిపల్ పరిధిలోని శ్మశాన వాటికల్లో వసతులు లేక దాహన సంస్కారాల కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నాలుగు, మున్సిపల్ పరిధిలోని ఆరు గ్రామాల్లో మొత్తం పది శ్మశాన వాటికలు ఉన్నాయి. కేవలం రెండింటిలో మాత్రమే నామమాత్రపు సౌకర్యాలు ఉన్నాయి. నీటి వసతి లేక ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. మూత్రశాలలు ఏర్పాటు చేయాలని గతంలో అధికారులను కోరినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం శ్మశాన వాటికలకు నిధులు మంజూరు చేసి వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



పరిగి: టీచర్స్ కాలనీలో వసతులు లేని శ్మశానవాటిక

చెడ్డీ గ్యాంగ్ ఆటకట్టిస్తాం

బెట్టింగ్‌లో మోసపోయిన వారు ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

- అటెన్షన్ డైవర్షన్ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలు
- ప్రైవేటు వాహనాలకు సైరన్లు ఉండొద్దు
- మున్సిపాలిటీల్లో ట్రాఫిక్ సమస్యను సామాజిక కోణంలో చూడాలి
- 'సాక్షి' తో ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

SAKSHI INTERVIEW

వికారాబాద్: 'జిల్లాలో బెట్టింగ్ వ్యవహారం మా దృష్టికి వచ్చింది..కానీ ఎవరూ ఫిర్యాదు చేయడం లేదు.. బాధితులు తమను సంప్రదిస్తే న్యాయం జరిగేలా చూస్తాం..' అని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బెట్టింగ్ భూతం, దొంగతనాలు, చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్, దొంగతనాలు, అటెన్షన్ డైవర్షన్ కేసులు, ట్రాఫిక్ సమస్యలపై 'సాక్షి' నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయన సమాధానాలు ఇలా..

సాక్షి: జిల్లాలో బెట్టింగ్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్పీ నారాయణరెడ్డి: బెట్టింగ్ అనేది ప్రధానంగా రెండు, మూడు రకాలుగా ఉంటుంది. యాప్‌ల ద్వారా బెట్టింగ్ ఆడటం.. క్రికెట్ బెట్టింగ్, క్యాసినోల ద్వారా బెట్టింగ్ ఆడుతుంటారు. మన ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్ ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిసింది. ఆర్గనైజ్డ్ బెట్టింగులతో ఎక్కువ ప్రమాదం ఉంటుంది. ముందుగా గెలుపు రుచి చూపించి ఉచ్చులోకి దింపుతారు.ఆ తర్వాత డబ్బులన్నీ లాగేస్తారు. బెట్టింగ్ బారిన పడి డబ్బు పోగొట్టుకున్న వారు లేదా బాధితుల తల్లిదండ్రులు పోలీస్ శాఖను సంప్రదిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేసి న్యాయం జరిగేలా చూస్తాం. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై నిఘా పెట్టాలి.

సాక్షి: జిల్లాలో దొంగతనాలు, చెడ్డీ గ్యాంగ్, అటెన్షన్ డైవర్షన్ మోసాలను ఎలా కట్టడి చేస్తారు?

ఎస్పీ: జిల్లాలో దొంగతనాలు కొంత మేర పెరిగిన మాట వాస్తవమే.. చోరీ సొత్తులో 60 నుంచి 70 శాతం రికవరీ చేస్తున్నాం. వికారాబాద్‌లో చెడ్డీ గ్యాంగ్ దొంగతనం, తాండూరులో 45 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లిన కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. త్వరలో ఆ ముఠాలను పట్టుకుంటాం. చాలా వరకు చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించాం. అంతర్రాష్ట్ర ముఠాల అటెన్షన్ డైవర్షన్ కేసుల్లో పురోగతి సాధించాం. ప్రజలు మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం జిల్లాలో ఐదారు వేల సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని ఏర్పాటు చేసుకుంటే కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

సాక్షి: కొంతమంది సొంత వాహనాలకు సైరన్లు ఏర్పాటు చేసుకున్నారు.. వాటిని ఎలా నియంత్రిస్తారు?

ఎస్పీ: ఈ విషయం మా దృష్టికి రాలేదు. ప్రైవేటు వ్యక్తుల వాహనాలకు సైరన్లు ఉంటే తొలగిస్తాం. అంబులెన్స్, పోలీసు వాహనాలకు మినహా ఎవ్వరికీ అనుమతి ఇవ్వలేదు.

సాక్షి: వికారాబాద్, తాండూరు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మీరు తీసుకునే చర్యలు?

ఎస్పీ: ట్రాఫిక్ సమస్య అనేది లా అండ్ ఆర్డర్ తోపాటు సామాజిక సమస్య కూడా. దీన్ని రెండు కోణాల్లో చూడాలి. ఒకటి వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేకపోవడం. వెహికల్స్ రాకపోకలకు, పాదచారులకు ఇబ్బంది కలగనంత వరకు కొంత సానుకూల ధోరణితో వ్యవహరిస్తాం. ఏ మాత్రం ఇబ్బందులు తలెత్తినా చర్యలు తీసుకుంటాం. పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే సమస్యలు రావు.

నేడు కడ్తాల్ మండలంలో హరీశ్‌రావు పర్యటన

కడ్తాల్: మండలంలో గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం బోయిగుట్ట, ముద్విన్ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరీశ్‌రావు ఉదయం 10 గంటలకు మండలంలోని చరికొండ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్ట తండాలో జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గిరిజనుల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ముద్విన్ గ్రామంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం బోయిన్‌గుట్ట తండాలో బహిరంగ సభలో మాట్లాడతారని వెల్లడించారు. సభకు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పేదలకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం మనదే



అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

- కేరెల్లి గ్రామంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ

ధారూరు: దేశంలోనే పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ధారూరు మండలం కేరెల్లి గ్రామంలో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం ధారూరు రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకనుంచి పేదల ఇళ్లలో కూడా సన్నబియ్యం అన్నం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇచ్చామని తెలిపారు. జిల్లాకు కొత్తగా 22,404 కార్డులు మంజూరైనట్లు వివరించారు. 8 లక్షల 52 వేల 122 మందికి 5,582 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వరి సాగు గణనీయంగా పెరిగిందని, పంట దిగుబడిని విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి మనం చేరామని పేర్కొన్నారు. సీఎం సహాయ నిధి కింద 9మంది పేదలకు రూ.5.65 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్‌బాబు, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదాబేగం, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు విజయభాస్కర్‌రెడ్డి, అశోక్ ముదిరాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్లోళ్ల రాములు, కాంగ్రెస్ నాయకులు చెన్నారెడ్డి, మహ్మద్ బాబాఖాన్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సరఫరా

అనంతగిరి: ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్ పట్టణం పాత గంజ్‌లోని రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సన్నబియ్యం పంపిణీ ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్‌బాబు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు రమేష్ కుమార్, మథిన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పక్కా ప్రణాళికతో సాగండి

- జిల్లాలో రాజీవ్ యువ వికాస పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మండల కేంద్రంలో రాజీవ్ యువ వికాస కేంద్రం ఏర్పాటు చేసి అర్హులైన నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ నెల 14వ తేదీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు కుల, ఆదాయ, ధ్రువీకరణ సర్టిఫికెట్లు కోరితే వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. రూ.50 వేల వరకు లబ్ధి పొందే వారికి వారం రోజులపాటు, రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి పొందే వారికి 15 రోజులు, రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు ప్రయోజనం పొందే వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వారు ఎంచుకున్న ప్రాజెక్టు నెలకొల్పడానికి ఆర్థిక వనరులు సమకూర్చాల్సి ఉంటుందన్నారు. జూలై మొదటి వారంలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రతి మండలంలో ఒక అధికారిని నియమించాలన్నారు. అలాగే సన్నబియ్యం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. డీలర్లు దొడ్డు బియ్యం ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు నవీన్, హనుమంతురావు, కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇతర అధికారులు

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాపన్న గౌడ్ వర్ధంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు కులాలను ఏకం చేసి భూస్వాములపై పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, డీబీసీడీఓ ఉపేందర్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు మల్లేశం, కమలాకర్‌రెడ్డి, డీపీఓ జయసుధ, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, జిల్లా బీసీ అసిస్టెంట్ ఆఫీసర్ భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుల్కచర్ల: సైబర్‌నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ ఖాజా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని అడగడం, యాక్సిడెంట్ జరిగిందని డబ్బులు అడగడం తదితర మోసపూరిత మాటలతో నమ్మించి మోసం చేస్తారని వివరించారు. సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

వీధి నాటకాలను ప్రోత్సహించాలి

కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్‌రెడ్డి



శరత్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న కళాకారులు

దోమ: వీధినాటకాలను ప్రజలు ప్రోత్సహించాలని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఊటుపల్లిలో మూడు రోజులుగా కొనసాగుతున్న మల్లికార్జున స్వామి మహత్యం వీధి నాటకానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్ల నాటి చరిత్రను కళాకారులు కాపాడుతూ ప్రజలకు అర్థవంతంగా కళ్లకు కట్టినట్లు వివరించడం హర్షనీయమన్నారు. యూత్ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాను వేదికగా యువత ఇబ్బందులకు గురవుతున్నారని.. తల్లిదండ్రులు విద్యార్థులకు మొబైల్ ఫోన్లు ఇవ్వకుండా సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం వీధి నాటకాలను ప్రదర్శించిన కళాకారులకు తనవంతు సాయంగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్‌ను శరత్‌కుమార్‌రెడ్డిని శాలువతో సన్మానించారు.

రేషన్ బియ్యం అవకతవకలపై ఫిర్యాదు



ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న జైత్వారం గ్రామస్తులు

కందుకూరు: జాతీయ ప్రజా పంపిణీ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నాడని మండల పరిధిలోని జైత్వారం గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్‌కు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ఇచ్చే బియ్యం కాంటలో మోసం చేస్తూ చాలా తక్కువగా ఇస్తున్నారన్నారు. రేషన్ షాపులో ఓ లబ్ధిదారుడికి 12 కిలోల బియ్యం ఇచ్చారు. అనంతరం అతడు బయట తూకం వేయగా ఒక్క కిలో తగ్గిందని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓర్సు వెంకటేష్, కుమ్మరి నర్సింహ, చల్లా జైపాల్‌రెడ్డి, నవీన్, మహేందర్, పాండు, అజయ్, కార్తీక్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు ఆస్పత్రికి సుస్తీ



కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రి



రోగికి సెలైన్ పెడుతున్న ఆయా

- ఓపీ చూసే వైద్యుడు లేక ఇబ్బంది పడుతున్న రోగులు
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పలువురు సిబ్బంది
- ఆయాలే వైద్యం చేస్తున్న వైనం

'సర్కారు ఆస్పత్రికి సుస్తీ చేసింది. నిర్లక్ష్యం, అలసత్వం, పర్యవేక్షణ లేకపోవడం వంటి వ్యాధులు సోకడంతో వాటిని నయం చేసేవారు కనిపించక ఇబ్బందులకు గురవుతున్న దుస్థితి. ఆపరేషన్లు మినహాయిస్తే అన్ని వైద్య సేవలు ఆయాలే చేస్తున్న పరిస్థితి. ఇది కుల్కచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం దర్శనమిస్తోంది.'

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలకు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి ఒక్కటే. వైద్యానికి వచ్చే పేదలు పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో వైద్య సిబ్బంది నిర్వాహకంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఓపీ చూసేవారు లేక..

ఆస్పత్రికి వచ్చిన వారిని పరీక్షించి వారికి మందులు రాసి ఇవ్వడం.. అవసరమైన వారికి ఇంజక్షన్లు వేయడం లాంటివి చూసుకునేందుకు ఓపీలో వైద్యుడు ఉండడం లేదు. పల్లె దవఖానా వైద్యురాలు ఓపీ వైద్యురాలిగా విధులు నిర్వహిస్తోంది. కోవిడ్ అనంతరం రెగ్యులర్‌గా ఓపీని చూసేందుకు వైద్యుడిని నియమించకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వైద్యాధికారికి పీజీ సీట్ రావడం వారానికి మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడికి వైద్యం కోసం వచ్చేవారికి సాకులు చెబుతూ వెనక్కి పంపుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

పోస్టులు ఖాళీ

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులను చూసేందుకు ఓపీలో వైద్యుడు లేక పోవడంతో వైద్యాధికారి మాత్రమే అన్ని విధులు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది విధుల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, మండల పరిధిలో అందుతున్న వైద్య సేవల పర్యవేక్షణ చేయాల్సిన సీహెచ్‌ఓ పోస్టు సైతం ఖాళీగానే ఉంది. గ్రామాల్లో ఏర్పాటుచేసిన పల్లె దవాఖానలకు చౌడాపూర్, కుస్మసముద్రం గ్రామాల్లో నర్సులే వైద్యం అందిస్తున్నారు. స్టాఫ్ నర్సు, సూపర్‌వైజర్ , ఫార్మాసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ పనిచేసే ఆయాలే వైద్యసేవలు అందిస్తున్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి వైద్య సేవలను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే వైద్య సిబ్బంది భర్తీ



ఓపీ చూసేందుకు తాత్కాలికంగా వేరే వైద్యులను ఏర్పాటు చేశాం. పరిస్థితులను బట్టి మరొక వైద్యుడిని సర్దుబాటు చేస్తాం. ఖాళీ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం, భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

– వెంకటరవణ, జిల్లా వైద్యాధికారి

వైభవం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

నేటితో ముగియనున్న ఉత్సవాలు



రథంపై ఉత్సవమూర్తులు



చంద్రప్రభ వాహనంపై స్వామివారు

కొడంగల్: ఉభయ దేవేరుల సమేత స్వామివారు బుధవారం ఉదయం రథోత్సవంపై భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మలయప్ప స్వామి రథంపై ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కూతురు, అల్లుడు రథోత్సవం వేడుకల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని స్వామివారి రథానికి పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు అభి షేకం నిర్వహించారు. మంగళవారం రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

నేడు చక్రస్నానం

గురువారం ఉదయం 9 గంటల నుంచి స్వామివారి పల్లకీ ఉత్సవం, చక్రస్నానం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ ఆవరణలోని కోనేరులో స్వామివారికి చక్రస్నానం చేయిస్తారు. రాత్రి 9 గంటలకు ధ్వజఅవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

భూ తగాదాల విషయంలో..

ఐదుగురికి రిమాండ్

పరిగి: దాయాదుల మధ్య జరిగిన భూతగాదాలో ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. బసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొమ్మిరే సత్యనారాయణ అతని అన్నదమ్ముళ్లు వెంకటేశ్, ప్రవీణ్, ఆనంద్, శంకర్ భూతగాదాల విషయమై దాయాదులైన ప్రశాంత్, సాయితేజ్, శంకర్, పాండుతో నిత్యం గొడలకు పాల్పడుతుండేవారు. ఈ నెల మార్చి 23న పాతకక్షలు మనసులో పెట్టుకున్న సత్యనారాయణ అన్నదమ్ములు.. కారుతో దాయదులపైకి స్పీడ్‌గా దూసుకెళ్లి హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులకు కాళ్లు విరగగా, ప్రశాంత్, సాయితేజ్, శంకర్, పాండుతో పాటు మరి కొందరు గాయపడ్డారు. దీంతో ప్రశాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా సత్యనారాయణ, వెంకటేశ్, శేఖర్, ఆనంద్ నిందితులుగా గుర్తించి రిమాండ్‌కు తరలించామన్నారు.



రాజస్థాని మహిళా మండలి నూతన కమిటీ ప్రతినిధులు

రాజస్థాని ప్రగతి సమాజం నూతన కార్యవర్గం

తాండూరు: రాజస్థాని ప్రగతి సమాజం తాండూరు నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మార్వాడి సమాజం సభ్యుల నడుమ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సమాజం అధ్యక్షుడిగా మురళీధర్ గగ్రాని, కార్యదర్శిగా సంపత్‌కుమార్ సార్డా, కోశాధికారిగా సంజయ్‌సోని, ఉపాధ్యక్షుడిగా ఓం ప్రకాష్ పర్తాని సహకార్యదర్శిగా ఆనంద్‌శర్మ, కార్యవర్గ సభ్యులుగా ద్వారకప్రసాద్‌సార్డా, లక్ష్మీకాంత్‌సోమాని, భగ్‌వాన్‌దాస్ బూబ్, సన్ని అగర్వాల్ నూతన కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజస్థాని మహిళా మండలి నూతన కమిటీ అధ్యక్షురాలిగా కిరన్ సార్డా, కార్యదర్శిగా వర్షకై లాస్‌సార్డా, కోషాధికారిగా కల్పన రాఠి, ఉపాధ్యక్షులుగా హేమసోని, వైజయంతిమాల, సహాయ కార్యదర్శులుగా రాధిక సార్డా, రితుసోని ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీలో ఎన్నికైన ప్రతినిధులకు మార్వాడి సమాజం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేష్ చంద్రసార్డా, రాజ్‌గోపాల్‌సార్డా, మార్వాడి యువమంచ్ ప్రతినిధులు తదితరులున్నారు.

ప్రత్యక్ష పోరాటాల కోసమే వర్క్‌షాప్

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మల్కయ్య తదితరులు

యాలాల: కేవీపీఎస్ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో చేపట్టనున్న వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య కోరారు. బుధవారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. కుల వివక్ష, అంటరానితనాన్ని రూపుమాపడానికి ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సన్నద్ధం చేయడానికి కేవీపీఎస్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్, సురేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్



ప్రమాణస్వీకారం చేసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అనంతగిరి: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వికారాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాలి బస్వరాజ్ పటేల్ అన్నారు. బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, జనరల్ సెక్రెటరీ పోలీస్ వెంకట్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ పటేల్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. వికారాబాద్‌లో కోర్టు కొత్త భవన నిర్మాణానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. జూనియర్ న్యాయవాదులకు విజ్ఞానం పెంపొందించేందుకు శిక్షణ తరగతులు నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవర్ధన్ రెడ్డి, కమల్‌రెడ్డి, అశోక్ , లవకుమార్ మాధవ్‌రెడ్డి నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, న్యాయవాద సంఘం ఉపాధ్యక్షుడు ఏ.శంకరయ్య, సంయుక్త కార్యదర్శి పి.ఆనంద్, మహిళా ప్రతినిధి ఎం.వసుంధర, కోశాధికారి మోహన్ రాథోడ్, గ్రంథాలయ కార్యదర్శి సాయిరాం, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి పరమేష్, కార్యవర్గ సభ్యులు పరశురామ్ , అయూబ్, యాసిన్ ఖురేషి, అనంతయ్య సీనియర్ న్యాయవాదులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

హత్య, అట్రాసిటీ కేసులో..

- నిందితుడికి జీవితఖైదు
- రూ.15వేల జరిమానా

బంట్వారం: మహిళ హత్య, అట్రాసిటీ కేసులో ఓ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.15 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి సెషన్స్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎం.భవాని బుధవారం తీర్పువెల్లడించారని ఎస్పీ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. 2017 మార్చి 30న ఉదయం 6 గంటల సమయంలో కోట్‌పల్లి కత్వ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ శవం ఉందని దోరటి నర్సయ్య గ్రామస్తులతో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలించాడు. మృతదేహం తన తమ్ముడి భార్య అడివమ్మదిగా గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు జత చేశారు. అప్పటి డీఎస్పీ శిరీష దర్యాప్తు చేపట్టి కోట్‌పల్లి మండలం లింగంపల్లికి చెందిన ఎర్రగొల్ల మహేష్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. వాదోపవాదాలు విన్న స్పెషల్ సెషన్స్ ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి ఎం.భవాని నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా స్పెషల్ పీపీ ప్రతాప్‌రెడ్డి, దర్యాప్తు అధికారులు డీఎస్పీ శిరీష , అప్పటి ధారూరు సీఐ ఉపేందర్, ప్రస్తుత ఐటీ డీఎస్పీ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, కేస్ బ్రీఫింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, సీడీఓ మహేశ్వర్‌రెడ్డిని ఎస్పీ నారాయణ రెడ్డి అభినందించారు.

మహిళ దారుణ హత్య

- అత్యాచారం చేసి హత్య చేసినట్లు పోలీసుల అనుమానం
- ఘటనా స్థలిని పరిశీలించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- వివరాలు సేకరించిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం



ఘటనా స్థలిలో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



డాగ్‌స్క్వాడ్‌తో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: వరుస హత్యలతో జనం ఉలిక్కి పడుతున్నారు. బుధవారం పెద్దేముల్ సమీపంలో పెద్దేముల్–సంగారెడ్డి ప్రధాన మార్గంలో పెద్ద చెరువు కెనాల్‌లో గుర్తు తెలియని మహిళ(35) మృతదేహం లభ్యమైంది. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, స్థానికులు తెలిపిన ప్రకారం.. పొలాలకు వెళ్తున్న క్రమంలో రైతులు కెనాల్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పెద్దేముల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వికారాబాద్ నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం రప్పించి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలి నుంచి బీహార్ వలస కూలీలు ఉంటున్న ఓ ఫాంహౌస్ వద్దకు వెళ్లి ఆగింది. గుర్తు తెలియని దుండగులు మహిళకు మద్యం తాపి అత్యాచారం అనంతరం హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళ ముఖం, చేతిని కాల్చేశారు. మృతురాలి చేతిపై యశోద అని పచ్చబొట్టు ఉంది. మృతురాలి శరీరంపై ఎరుపురంగు చీర, జాకెట్ ఉంది. మహిళ ఆచూకీ తెలిసిన వారు పెద్దేముల్ పోలీసులకు గానీ తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి 8712670017, రూరల్ సీఐ 8712670051, పెద్దేముల్ ఎస్ఐ 8712670053 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం రెండు రోజుల పాటు మృతదేహాన్ని భద్రపరుచుతామని.. మృతురాలి సంబంధీకులు ఎవరూ సంప్రదించకుంటే ఖననం చేస్తామని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

వివాహం కావడం లేదని..

యువకుడి బలవన్మరణం

పూడూరు: వివాహం కావడం లేదని ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చన్గోముల్ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కదుమూరి ప్రసాద్(29) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లీడు వచ్చినా తనకు వివాహం కావడం లేదని తరచూ మానసిక వేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేక పోవడంతో గడియ పెట్టుకుని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. మృతుడి తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసులపై దాడి చేసిన యువకుల అరెస్టు

రాజేంద్రనగర్: విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుళ్లపై దాడికి పాల్పడిన ఐదుగురిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ క్యాస్ట్రో సమాచారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబియన్స్ ఫోర్సు చౌరస్తా వద్ద కొందరు యువకులు రోడ్డుపై గొడవ పడుతున్నారని డయల్ 100కు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ చంద్రశేఖర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గొడవ పడుతున్న వారిని సముదాయించేందుకు ప్రయత్నించగా వినిపించుకోకుండా పోలీసులపైనే దాడి చేశారు. దీంతో స్టేషన్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడిన రాజేంద్రనగర్, నౌ నంబర్, హ్యాప్పీ హోమ్స్ ప్రాంతాలకు చెందిన ఖాజా అద్నాన్(24), మహ్మద్ ఆర్బాజ్‌ఖాన్(19), సయ్యద్ అబ్దుల్(21), ఖాజా ఫయాజుద్దీన్(22), షేక్ హిమాయత్ అలీ(22)లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

షాద్‌నగర్: హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలు.. గుర్తు తెలియని వ్యక్తి బుధవారం ఉదయం బూర్గుల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా కాచిగూడ డెమో రైలు ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించగా పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా డాక్టర్ అబ్దుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు.

వర్సిటీ భూముల అమ్మకానికి కుట్ర

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపి.. పర్యావరణాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. 400 ఎకరాల యూనివర్సిటీ భూములను ప్రభుత్వం అమ్మేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, వర్సిటీల బలోపేతానికి కృషి చేస్తానని చెప్పిన ప్రభుత్వం అందుకు సంబంధించిన యూనివర్సిటీ భూములకు అమ్ముకోవడం సరికాదన్నారు. నిరసన, ధర్నాలు చేస్తున్న విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరీ ప్రవర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రయ్య, హబీబ్, సత్తయ్య, యాదగిరి, మహిపాల్‌రెడ్డి, రఘురాం, విజయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



లక్ష్మమ్మ మృతదేహం

శంకర్‌పల్లి: అతివేగం, అజాగ్రత్తగా వెళ్తున్న ఓ బొలెరో వాహనం రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌నగర్‌కి చెందిన లక్ష్మమ్మ(70) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. మంగళవారం రాత్రి సమయంలో రోడ్డు దాటుతుండగా శంకర్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ బొలెరో వాహనం బలంగా ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

బీఎంపీ జిల్లా అధ్యక్షుడు ఘట్యనాయక్



పోలీసుల అదుపులో ఘట్యనాయక్

పరిగి: విద్యావ్యవస్థలను కాపాడడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఘట్యనాయక్ ఆరోపించారు. హెచ్‌సీయూ భూములను అమ్మరాదని బీఎంపీ బుధవారం ధర్నాకు పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మ కుట్ర పన్నుతోందన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై అక్రమ కేసులు సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట గోవింద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఔషధ వినియోగంపై చైతన్యం

పాలమూరు వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్

దోమ: ఔషధ వినియోగంపై ప్రజల్లో అవగాహన అవసరమని పాలమూరు వర్సిటీ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.ఈశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–7 ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులతో పురవీధుల్లో ప్లకార్డుతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఔషధ వినియోగం, జీవనశైలి రుగ్మతలు, క్యాన్సర్, ఎయిడ్స్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధుల వంటి ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఏడు రోజులు అవగహన కల్పించనున్నామని తెలిపారు. జీవనశైలిలో మార్పులు, ప్రాముఖ్యతను గురించి ప్రజలకు వివరించనున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు యాంటీ బయోటిక్స్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారని, వాటి వలన ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. అందువలన సరైన ఆహారపు అలవాట్లను తీసుకుంటూ చక్కెర వ్యాధి, రక్తపోటుకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.